క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



విద్యార్థులతో కోచ్‌లు

బేతంచెర్ల: మానసిక ఉల్లాసానికి, శారీరక ధృడత్వానికి క్రీడలు చాలా అవసరం అని కరాటే కోచ్ వెంకటేష్, మాస్టర్ నాగన్న అన్నారు. ఆదివారం పట్టణంలోని విద్యార్థులకు మండల స్థాయిలో తైక్వాండో బెల్టు గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చాటిన 12 మందికి ఎల్లో బెల్ట్, గ్రీన్ బెల్ట్-10, గ్రీన్ వన్ బెల్ట్-5, బ్లూ బెల్ట్-1, బ్లూ వన్ బెల్ట్-2, రెడ్ వన్ బెల్ట్-2 ప్రదానం చేశారు. సుమేధా స్కూల్ హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

వేడుకగా ద్రోణపురి వీరాంజనేయస్వామి ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

డోన్: అమావాస్యను పురస్కరించుకుని స్థానిక పాతపేట వంకవీధిలో వెలసిన ద్రోణపురి వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ మాలధారులు స్వామివారిని పురవీధుల మీదుగా ఊరేగించారు. కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో నెల పాటు నిత్యాన్నదానం నిర్వహించినట్లు ప్రధాన అర్చకుడు సురేష్ స్వామి తెలిపారు. స్థానికులు ఎర్రిస్వామి, అజయ్, వడ్డె వీరాంజి, రాకేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్‌ఐ

ప్యాపిలి: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్‌ఐ మధుసూదన్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందన్నారు. అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని సత్ప్రవర్తనతో మెలిగితే ఉన్నతాధికారులకు సిఫారసు చేసి రౌడీషీటర్‌లో పేర్లు తొలగిస్తామన్నారు.

లెప్రసీ కాలనీవాసులకు దుస్తుల పంపిణీ



దుస్తులు అందుకున్న కాలనీవాసులు

డోన్: ముందస్తు క్రిస్మస్ వేడుకల సందర్భంగా స్థానిక లెప్రసీ కాలనీలో ప్రార్థన సమయం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో కాలనీవాసులకు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. అనంతపురం జిల్లా హిందూపురంకు చెందిన వరదరాజులు, మేరీ మంజుల ఆర్థిక సహాయంతో దుస్తులు పంపిణీ చేసినట్లు జాన్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతికి నివాళి



కొత్తకోట వడ్డె నాగరాజు (ఫైల్)

డోన్: పట్టణంలోని కొత్తకోటకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వడ్డె నాగరాజు (65) శనివారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, పార్టీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, సింగిల్ విండో అధ్యక్షుడు తిరునాంపల్లె తిరుమల్ రెడ్డి, సోమేష్ యాదవ్, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మదన్ యాదవ్ కొత్తకోటకు వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి ఫోన్‌లో నాగరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ముగిసిన కార్తీక పూజలు

కొలిమిగుండ్ల: శివునికి ప్రీతికరమైన కార్తీక మాసం ఆదివారం మధ్యాహ్నంతో ముగిసింది. నెల రోజుల పాటు శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కార్తీక స్నానాలు ఆచరించి భక్తి శ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. చివరి రోజు కొలిమిగుండ్లలోని లలితా సుందరేశ్వర స్వామి ఆలయం, బందార్లపల్లె సమీపంలోని నేల బెలుం మల్లేశ్వరస్వామి ఆలయం, బెలుం, పెట్నికోట, అంకిరెడ్డిపల్లె, కనకాద్రిపల్లె తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు విశేష పూజలు చేశారు.

రబీసాగు.. సాఫీగా సాగేనా

- వర్షం కోసం శనగ రైతుల ఎదురుచూపులు
- 24 వేల హెక్టార్లకు పైగా శనగ సాగు
- నెల నుంచి చినుకు జాడ కరువు
- ఆందోళనలో అన్నదాతలు



హనుమంతుగుండం సమీపంలో సాగులో ఉన్న శనగపంట

కొలిమిగుండ్ల: బనగానపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా రబీ సీజన్‌లో వర్షాధారం కింద అత్యధికంగా శనగ పంట చేస్తుంటారు. అయితే ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఏ సీజన్‌లో పంట సాగు చేసినా లాభాలు గడించే పరిస్థితి కనిపించడం లేదు. విత్తనం మొదలుకొని పంట ఉత్పత్తి వరకు ఎప్పుడు ఏ రూపంలో ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. రబీ ప్రారంభానికి ముందుగా భారీ వర్షాలు కురవకపోయినా మోస్తరు వర్షాలు కురిశాయి. భూమిలో తేమ శాతం ఉండడంతో రైతులు శనగ పంటను విస్తారంగా సాగు చేశారు. విత్తనం వేశాక వరుణుడు ముఖం చాటేశాడు. కొద్ది రోజుల నుంచి మంచు కురుస్తుండడంతో పంట కొంత వరకు పచ్చగా ఉంది. బనగానపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాల్లో 24,767 హెక్టార్లలో శనగ సాగులో ఉంది. విత్తనాలు, సేద్యం, ఎరువులు, క్రిమిసంహారక మందుల ఖర్చులు కలుపుకుని ఎకరాలకు రూ.10 వేల చొప్పున పెట్టుబడి పెట్టారు.

కరుణించని వరుణుడు

ఏటా రబీ సీజన్‌లో సాంప్రదాయ పంటగా శనగ ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. ఈ ఏడాది విత్తనం వేసి మొలకలు వచ్చిన తర్వాత వరుణుడు జాడ లేకుండా పోయింది. నెల నుంచి చినుకు జాడ కరువైంది. ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటున్నా చినుకు రాలకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం ఈ రబీ సీజన్‌లో అయినా గట్టెక్కుతామా లేదా అనే ప్రశ్నార్థకంలో మునిగిపోయారు. ఇప్పటికే కొన్ని చోట్ల శనగ వాడుముఖం పట్టడంతో కొంత మంది రైతులు నీళ్లు కట్టుకుంటున్నారు. వర్షాధారం కింద పంట సాగు చేయడంతో నీళ్ల తడులు కట్టుకోవాలన్నా రైతులకు ఇబ్బందికరంగా మారుతోంది. వర్షం కురవకపోతే దిగుబడులు భారీగా తగ్గిపోయే ప్రమాదముందని రైతులు పేర్కొంటున్నారు. సాధారణంగా అన్ని అనుకూలిస్తే ఎకరాకు 6 బస్తాలకు పైగానే దిగుబడులు వస్తాయి. ప్రస్తుత పరిస్థితుల్లో వరుణుడి మీదనే ఆశలు పెట్టుకున్నారు.

నియోజకవర్గంలో శనగ పంట సాగు వివరాలు

మండలం	హెక్టార్లలో
కొలిమిగుండ్ల	4700
సంజామల	9075
కోవెలకుంట్ల	7150
అవుకు	1850
బనగానపల్లె	1992

ప్రస్తుతం బాగానే ఉంది



15 ఎకరాల్లో శనగ పంట సాగు చేశాను. ప్రస్తుతం బాగానే ఉంది. ఇప్పుడు పంటకు వర్షం చాలా అవసరం. వాన కురవకపోతే నీళ్లు కట్టుకోవాల్సి ఉంటుంది. తుపాన్ ఉండడంతో వర్షం వస్తుందని నమ్మకంతో ఉన్నాం. దిగుబడి తగ్గిపోయే ప్రమాదముంది. చాలా చోట్ల పంట వాడుముఖం పడుతోంది.

–నాగేశ్వరరెడ్డి, ఆకుమల్ల

పెట్టుబడులు వచ్చే అవకాశం ఉండదు



విత్తనం వేయక ముందు ఆశాజనకంగా వర్షాలు కురవడంతో పది ఎకరాల్లో సొంతంగా, 30 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేశాను. ఎకరాకు రూ. 10 వేలకు పైగానే ఖర్చు వచ్చింది. విత్తనం వేసినప్పటి నుంచి చినుకు జాడలేదు. ఇలాగే ఉంటే పెట్టుబడులు దక్కవు.

–ఈశ్వరయ్య, నాగిశెట్టిపల్లె

వాన రాకపోతే పెట్టుబడులు సైతం వచ్చే అవకాశాలు ఉండవనే ఆందోళనలో ఉన్నారు. రైతులకు కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తుందని అనుకున్నా మొండిచేయి చూపడంతో అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాల్సి వచ్చిందని వాపోయారు.

వ్యవసాయానికి విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళ తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామల: మండలంలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఈ వారం వ్యవసాయానికి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె గ్రామాల్లో పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సంజామల: మండల పరిధిలోని మిక్కినేనిపల్లె గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. సమాచారంతో దాడి చేశామన్నారు. నిందితుల వద్ద నుంచి రూ.1450 నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆలయాల రక్షణ అందరి బాధ్యత





మాట్లాడుతున్న హైందవ శంఖారావం రాష్ట్ర కో-కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి, బనగానపల్లెలో చంద్రశేఖర్

కొలిమిగుండ్ల: దేవాలయాలను కాపాడుకునేందుకు హిందువులంతా చేయి చేయి కలిపి శంఖారావం పూరించాల్సిన సమయం ఆసన్నమైందని హైందవ శంఖారావం రాష్ట్ర కో-కన్వీనర్ విష్ణువర్ధనరెడ్డి అన్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం స్థానిక షిర్డీ సాయి పంక్షన్ హాల్‌లో వివిధ గ్రామాలకు చెందిన వారితో హిందూ సమ్మేళన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయాల నిర్వహణ బాధ్యతలను పూర్తిగా అప్పగించాలని దేశవ్యాప్తంగా ఉద్యమం ప్రారంభమైందన్నారు. గ్రామాల్లో మత మార్పిడి జరుగుతున్నాయని.. ఆలయాల నిర్మాణం జరిగితే మార్పిడీలను అరికట్టవచ్చని చెప్పారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 550 ఆలయాల నిర్మాణం జరిగిందని గుర్తు చేశారు. ఆలయాలను పరిరక్షించేందుకు రాజకీయాలకు అతీతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీనివాసులు, ఆర్ఎస్ఎస్ కార్యవర్గ సభ్యులు రామాంజనేయ, భజరంగదళ్ కన్వీనర్ సందీప్, నారాయణరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

బేతంచెర్ల: దేవాలయాల పరిరక్షణ కోసం జనవరి 5వ తేదీ విజయవాడలో తలపెట్టిన విశ్వహిందూ పరిషత్ హైందవ శంఖారావ సభను విజయవంతం చేయాలని హైందవ శంఖారావం డోన్ నియోజకవర్గ ఇన్‌చార్జి పినాకపాణి, మారుతి శర్మ, గుండా గోపాల్ కోరారు. ఆదివారం పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తి చేసి, స్వయం ప్రతిపత్తి కలిగిన ధార్మిక వ్యవస్థకు అప్పగించాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ జాతీయోద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. మండల కన్వీనర్ రామూర్తి, మధు మోహన్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, డక్కి శేఖర్, మోహన్, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్వహణ హిందూ సమాజానికి అప్పగించాలి

బనగానపల్లె రూరల్: హిందూ దేవాలయాల నిర్వహణను హిందూ సమాజానికి అప్పగించాలని ఆర్ఎస్ఎస్ ప్రచారక్ చంద్రశేఖర్ అన్నారు. బనగానపల్లెలోని బీవీ సుబ్బారెడ్డి ఫంక్షన్ హాల్‌లో హైందవశాఖారావ సభ నియోజకవర్గ కన్వీనర్ ఓబులరెడ్డి ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. హిందూ సంప్రదాయాలు, సంస్కృతిని పిల్లలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందన్నారు. జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శాఖారావం సభకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కిశోర్‌కుమార్, బీవీ సుబ్బారెడ్డి, మాధవరెడ్డి, టీఆర్ జగన్నాథ్‌రెడ్డి, శివకృష్ణ, రమణారెడ్డి, వెంకట సుబ్బ య్య, నాగమల్లారెడ్డి, కమల్ తేజారెడ్డి, రామచంద్రా రెడ్డి, గంగాభవానిదేవి, భాగ్యలక్ష్మీ, పద్మావతి, దేవి పాల్గొన్నారు.

కూటమి పాలనలో బాదుడే బాదుడు

- ఆరు నెలల్లోనే రెండుసార్లు విద్యుత్ చార్జీల వడ్డన
- పెంచిన చార్జీలు ఉపసంహరించకుంటే ఉద్యమిస్తాం
- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్: కూటమి వస్తే చార్జీలను పెంచమని ప్రజలకు వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే విద్యుత్ చార్జీలు పెంచి బాదుడే బాదుడుగా చంద్రబాబు తన మార్క్ రాజకీయం చూపించారని వైఎస్సార్‌సీపీ బనగానపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. ఆదివారం బనగానపల్లెలోని తన స్వగృహంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలోనే రెండుసార్లు విద్యుత్ చార్జీలు పెంచారని విమర్శించారు. ప్రజలపై రూ.15,485 కొట్ల భారం మోపారని తెలిపారు. ఎన్నికల ముందు ప్రజలకు బాబు ఇచ్చిన ష్యూరిటీ ఏమోగాని బాబు బాదుడు గ్యారెంటీ అన్న పరిస్థితి నెలకొందన్నారు. మోసం చేయడంలో బాబు బ్రాండ్ అంబాసిడర్ అని ఎద్దేవా చేశారు. చంద్రబాబునాయుడు పాలనలోనే విద్యుత్ చార్జీలు యూనిట్‌కు రూ.5.90తో ఒప్పందం జరిగిందని, వైఎస్సార్‌సీపీ హయాంలో యూనిట్‌కు రూ.2.49తో ఒప్పందం జరిగిందని.. దీన్ని బట్టి ఎవరి హయాంలో అవినీతి జరిగిందో ప్రజలు గమనించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఏది పెరిగినా, ఏ సంఘటన జరిగినా వైఎస్సార్‌సీపీపై నిందలు మోపుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధులపై అక్రమ కేసులు బనాయిస్తూ రాష్ట్రంలో అరాచక పాల సాగిస్తున్నారన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకుంటే పోరాటాలు చేస్తామన్నారు.

ప్రజలపై భారం

విద్యుత్ చార్జీలతో పాటు నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు పెరగడంతో సామాన్యులపై ఆర్థిక భారం పడుతోందన్నారు. పాఠశాలలు, కళాశాలలు, హాస్టల్ ఫీజులు చెల్లించలేక విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకపోవడంతో ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత నెలకొందన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలోనే సంక్షేమ పథకాలు అర్హులందరికీ సకాలంలో అందేవన్న భావన ప్రజల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలు చేయడంపై దృష్టి సారించాలని హితవుపలికారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, యాగంటి ఆలయ చైర్మన్ తోటబుచ్చిరెడ్డి, నాయకులు అత్తార్‌జాహెద్, బండి బ్రహ్మానందరెడ్డి, అంబటి రవికుమార్‌రెడ్డి ఉన్నారు.

లేగ దూడకు చికిత్స



అనారోగ్యానికి గురైన లేగదూడ

డోన్: స్థానిక సుందర్ సింగ్ కాలనీలోని మారుమూల ప్రాంతంలో నాలుగు రోజుల లేగ దూడకు కడుపులో పుండు కావడంతో లేవలేక అచేతనంగా ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న ద్రోణాచలం సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు షాధిఖాన రాజు, వెటర్నటీ అసిస్టెంట్ మహేంద్రను తీసుకెళ్లి లేగదూడకు డ్రస్సింగ్ చేయడంతో పాటు ఇంజెక్షన్లు వేసి కట్టు కట్టించారు. వరుసగా మూడురోజులు డ్రస్సింగ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. లేగదూడకు సంబంధించిన వారు ఎవరైనా వచ్చి తీసుకెళ్లాలని కోరారు.

వడ్డెర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న వడ్డెర సంఘం జాతీయ కార్యదర్శి సుబ్బారాయుడు

బనగానపల్లె రూరల్: ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం వడ్డెర కులస్తులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆ సంఘం జాతీయ కార్యదర్శి శిల్పిసుబ్బారాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో వడ్డెర సంఘం ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వస్తే వడ్డెర కులస్తులు, సంఘాల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని.. ప్రభుత్వం ఏర్పాటై ఐదు నెలలు అయినా ఇంత వరకు వడ్డెర సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వడ్డెర సమస్యల పరిష్కారం కోసం త్వరలో వడ్డెర మహాసభ ఏర్పాటు చేస్తామని తెలిపారు. సంఘం నాయకులు వెంకటసుబ్బయ్య, సుబ్బరాయుడు, గంగన్న, మంజులకర్ణ పాల్గొన్నారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేటలో ఉన్న గాడుబావి వీరాంజనేయస్వామి, గౌరిపేటలోని ఆంజనేయస్వామి, పలక చింతమాను, కనుమ, సిమెంట్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం అమావాస్య పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, సింధూర అర్చన, ఆకుపూజ, మహామంగళహారతి ఇచ్చారు. బనగానపల్లె రహదారిలోని పుట్ట పెద్దమ్మ ఆలయం, సిమెంట్ నగర్ గ్రామంలోని సుంకులా పరమేశ్వరి అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.





గాడు బావి ఆంజనేయ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు, సిమెంట్‌నగర్‌లోని అభయాంజనేయస్వామి

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

బేతంచెర్ల: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని..నేరాలకు దూరంగా ఉండాలని సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు ఎస్‌ఐ రమేష్‌బాబుతో కలిసి కౌన్సెలింగ్ ఇచ్చారు. గొడవలు, చెడు వ్యసనాలు, సాటుసారా, పేకాటకు దూరంగా ఉండాలని సూచించారు. గతంలో క్షణికావేశంలో చేసిన తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. ప్రశాంత జీవితం గడపాలన్నారు. అనంతరం పట్టణంలో వాహనాల తనిఖీ చేసి రికార్డులు సక్రమంగా లేనివారిపై కేసులు నమోదు చేశారు.

కొండమనాయునిపల్లెలో కార్డన్ సెర్చ్

- 20 ద్విచక్రవాహనాలు, 50 లీటర్ల సారా సీజ్



స్వాధీనం చేసుకున్న సామగ్రితో పోలీసులు

అవుకు: మండల పరిధిలోని కొండమనాయునిపల్లె గ్రామంలో సీఐ మంజునాథ్‌రెడ్డి, అవుకు ఎస్‌ఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సిబ్బందితో కలిసి గ్రామంలోని అనుమానిత ఇళ్లు, పశువుల పాకలు, గడ్డివాముల్లో తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలు, 50 లీటర్ల నాటుసారా, 300 కేజీల బెల్లంను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హితవుపలికారు. అలా కాదని సారా తయారీ చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో గొడవలు, అక్రమ మద్యం, సారా విక్రయాలపై పోలీసులకు సమాచారంఇవ్వాలని కోరారు. హెడ్ కానిస్టేబుల్ సుంకన్న, కానిస్టేబుల్ నరేష్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై సభ్యుల ధ్వజం

- ఆరు నెలల పాలనలోనే పేదలపై భారం మోపుతారా..?
- విద్యుత్ స్తంభాల ఏర్పాటులో నిర్లక్ష్యంపై ఆగ్రహం
- రసాభాసగా కోవెలకుంట్ల మండల మీట్



మండల మీట్‌లో సమస్యలపై అధికారులను నిలదీస్తున్న కోఆప్షన్‌మెంబర్ దిల్కాబాషా

కోవెలకుంట్ల: కూటమి ప్రభుత్వ ఆరునెలల పాలనలోనే ఇష్టారాజ్యంగా విద్యుత్ చార్జీలు పెంచి పేదలపై భారం మోపడంపై సభ్యులు ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల రాలేకపోయారు. మూడు నెలల కాలంలో మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల పురోగతిపై చర్చ జరిగింది. విద్యుత్‌శాఖపై చర్చకు రాగా విద్యుత్ చార్జీలను విపరీతంగా పెంచడంతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలపై పెనుభారం పడుతోందని మండల కో ఆప్షన్‌మెంబర్ దిల్కాబాషా సభ దృష్టికి తెచ్చారు. నెలకు వేలాది రూపాయల విద్యుత్ బిల్లులు వస్తున్నాయని, పేదల కష్టార్జితం విద్యుత్ బిల్లుల చెల్లింపుకే సరిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌కో ఏఈ రామమోహన్ మాట్లాడుతూ.. రాయితీతో ఇళ్లపై సోలార్‌రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకోవడం పేదలకు ఎలా సాధ్యమని సభ్యులు ప్రశ్నించారు. మండలంలోని బిజనవేముల బీసీ కాలనీలో విద్యుత్ స్తంభాలు, వైర్లు ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోవడం లేదని ఉపసర్పంచ్ భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి సభ దృష్టికి తెచ్చారు. గత మండల మీట్‌లో ఇదే ప్రస్తావన వచ్చినా విద్యుత్‌శాఖ లైన్‌మెన్లు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంపీపీ రమాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రాన్స్‌కో సిబ్బంది పనితీరు మార్చుకుని ప్రజలకు సేవలందించాలని సూచించారు. జాతీయ ఉపాధి హామీ పథకంపై చర్చకు రాగా ముస్లిం శ్మశానవాటికలో ముళ్లపొదలు నిండిపోయాయని..తొలగించాలని మండల కో ఆప్షన్‌మెంబర్ సభ దృష్టికి తెచ్చారు. ఆ పథక ఏపీఓ శ్రీవిద్య మాట్లాడుతూ.. శ్మశాన వాటికలో రెండేళ్ల క్రితం మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్నామని తెలిపారు. అయితే ఎలాంటి మొక్కల పెంపకం లేదని ఒకసారి వచ్చి చూడాలని కోరారు. మండలంలోని ఆయా గ్రామాల్లో రూ. 4.90 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పంచాయతీరాజ్ ఏఈ చెంచయ్య తెలిపారు. ఈ నిధులతో గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. అనంతరం వివిధ శాఖల పనితీరుపై మొక్కుబడిగా చర్చ సాగింది. ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. జెడ్పీటీసీ గోపిరెడ్డి వెంకటలక్ష్మమ్మ, సర్పంచ్ మెట్ల సరళ, ఎంపీడీఓ వరప్రసాదరావు, తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, ఈఓపీఆర్డీ ప్రకాష్‌నాయుడు, వెలుగు ఏపీఎం శేఖర్, ఎంఈఓలు వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, ఏఓ నిరంజన్ పాల్గొన్నారు.

రేపు దివ్యాంగుల దినోత్సవం



మాట్లాడుతున్న దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవరాజు

కోవెలకుంట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించ తలపెట్టిన దివ్యాంగుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అందనం దేవరాజు పిలుపునిచ్చారు. ఆదివారం కోవెలకుంట్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. అర్హులైన దివ్యాంగులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించాలని, ఉచిత విద్యుత్, బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. అంత్యోదయ కార్డులు, త్రీవీలర్ స్కూటీలు, బ్యాటరీ సైకిళ్లు తదితర 22 డిమాండ్లను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. సంఘం నాయకులు ఆలీ, రమణ, చెన్నయ్య, ఓబులేసు, సర్దార్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎయిడ్స్ రోగులకు నిత్యావసరాల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

కోవెలకుంట్ల: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆదివారం సీహెచ్‌సీ పరిధిలోని ఎయిడ్స్ రోగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన విక్కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం, కందిపప్పు, తదితర నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎయిడ్స్‌వ్యాధిపై అవగాహన లేకపోవడంతోనే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు వ్యాధిబారిన పడుతున్నారన్నారు. ఫౌండేషన్ అధినేత గోపిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, సభ్యులు పరమేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, టీబీ యూనిట్ ఆఫీసర్ పరమేశ్వరరెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.